# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 18 సంచిక: 363 | శనివారం, 30 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

- విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి
- ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ పరిధిలోని నిర్మాణాలు
- గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
- ప్రతి విద్యా సంస్థలో క్రీడలకు ప్రాధాన్యం
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహారీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యతప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని ఈ విషయంలో ఎటువంటి అలసత్వం ..మిగతా 2లో

## 2.2 లక్షల ఎకరాల్లో పంట నష్టం

- లక్షలాది రైతులు ప్రభావితులు
- వరి, పత్తి, సోయాబీన్ పంటలకు భారీ దెబ్బ
- పంటనష్టంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణలో కురిసిన భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన పంట నష్టం జరిగింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం, మొత్తం 2,20,443 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అందిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 28 జిల్లాల 270 మండలాల్లో పంటలకు నష్టం జరిగింది. సుమారు 1,43,304 మంది రైతులు ప్రభావితమయ్యారని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా వరి పంట ఎక్కువగా దెబ్బతింది. మొత్తం 2,463 గ్రామాల్లో 1,09,626 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. అదే విధంగా పత్తి 60,080 ఎకరాల్లో, మొక్కజొన్న 16,036 ఎకరాల్లో, మిర్చి 194 ఎకరాల్లో నష్టపోయాయి. కంది 6,751 ఎకరాల్లో, జొన్న 15 ఎకరాల్లో, పల్లి 116 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. సోయాబీన్ పంటలు కూడా తీవ్రంగా ..మిగతా 2లో







## మెరుగైన సేవలు అందించాలి

- జనవరి నుంచి జులై వరకు 5.44 లక్షల మందికి చికిత్స
- ప్రైవేటు హాస్పిటల్స్ నిర్లక్ష్యం పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- అత్యవసర పేషెంట్లకు సమన్వయంతో సేవలు అందించాలి
- నిమ్స్‌లో వైద్య సేవలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

02

## ప్రధాని మోదీకి ప్రత్యేక కానుక

- జపాన్ పర్యటనలో 'దరుమా' బొమ్మను బహూకరించిన ఆలయ ప్రధాన పూజారి
- పట్టుదలకు, అదృష్టానికి చిహ్నంగా భావించే బొమ్మ
- భారతీయ బౌద్ధ సన్యాసి బోధిధర్ముడికి ప్రతీక ఈ దరుమా
- కాంచీపురానికి చెందిన బోధిధర్ముడి నుంచే ఈ సంప్రదాయం

02



## జీఎస్టీ రేషనలైజేషన్‌తో రాష్ట్రానికి భారీ నష్టం

- తెలంగాణకే రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం కోత
- 14శాతం వృద్ధి హామీ విఫలం – కేవలం 7శాతం గ్రోత్ మాత్రమే
- సెప్టెంబర్ 3 జీఎస్టీ కౌన్సిల్‌లో రాష్ట్రాల ఏకగ్రీవ డిమాండ్లు
- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఢిల్లీలో జరిగిన సమావేశంలో జీఎస్టీ రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సమావేశానికి ఎనిమిది రాష్ట్రాల మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు భారీ రెవెన్యూ నష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన తెలిపారు, “అన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు ..మిగతా 2లో







## యువతులు, మహిళలను తాకుతూ శునకానందం

02

- మొబైల్ ఫోన్‌తో రికార్డ్ చేసిన మహిళ
- బైక్ నెంబర్ ఆధారంగా యువకుల గుర్తింపు
- వందలాది మంది ఆకతాయిలపై కేసులు

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ వ్యూహం

- మాగంటి గోపినాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తప్పనిసరి
- బీజేపీ వ్యూహాత్మకంగా ఐదుగురితో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు
- కమిటీలో కీలక నేతలకు బాధ్యతలు
- జూబ్లీహిల్స్ ఫలితం హైదరాబాద్ రాజకీయాలపై ప్రభావం




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆరోగ్య సమస్యల కారణంగా మృతి చెందడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావించిన తెలంగాణ బీజేపీ, స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ..మిగతా 2లో

## ప్రియుడితో కలిసి భర్తను చంపేసిన భార్య

- హైదరాబాద్ సరూర్ నగర్‌లో వెలుగుచూసిన దారుణ హత్య
- నిద్రలో చనిపోయాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం
- అనుమానంతో విచారించగా నేరం అంగీకరించిన నిందితురాలు
- భార్యను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న ప్రియుడి కోసం గాలింపు



02



# మెరుగైన సేవలు అందించాలి

- జనవరి నుంచి జులై వరకు 5.44 లక్షల మందికి చికిత్స
- ప్రైవేటు హాస్పిటల్స్ నిర్లక్ష్యం పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- అత్యవసర పేషెంట్లకు సమన్వయంతో సేవలు అందించాలి
- నిమ్స్‌లో వైద్య సేవలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

నిమ్స్‌లో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగింది. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ, ఈ ఏడాది తొలి 7 నెలల్లో (జనవరి-జులై) 5.44 లక్షల మంది రోగులకు వైద్య సేవలు అందించామని తెలిపారు. వీరిలో సగానికి పైగా ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందారని వివరించారు. నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నందున నిమ్స్‌ను ఆశ్రయించే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. అదేవిధంగా, ఈ ఏడాది ఇప్పటివరకు వందకు పైగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా జరిపామని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్స్ డైరెక్టర్, వైద్యులు, సిబ్బందిని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వచ్చే రోగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత త్వరగా అడ్మిట్ చేసి, అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. ఎమర్జెన్సీ వార్డులో ప్రాథమిక చికిత్స అనంతరం సంబంధిత వార్డుకు షిఫ్ట్ చేయాలని ఆదేశించారు. డైరెక్టర్ బీరప్ప వివరించిన ప్రకారం, ప్రస్తుతం నిమ్స్ ఎమర్జెన్సీకి రోజూ 80 నుంచి 100 మంది రోగులు వస్తున్నారు. వీరిలో సగం మందికి పైగా ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో చికిత్స తీసుకొని, పరిస్థితి విషమించాక చివరి నిమిషంలో నిమ్స్‌కు వస్తున్నారని తెలిపారు. కొన్ని ప్రైవేటు హాస్పిటల్స్ ఆపరేషన్లు చేసి, పేషెంట్లు పూర్తిగా కోలుకోక ముందే డిశ్చార్జ్ చేసి, నిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ హాస్పిటల్స్‌కు పంపిస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులు నిమ్స్‌పై భారం పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి రాజనర్సింహ ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి వచ్చే పేషెంట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని, అయితే ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి వచ్చే వారిని కూడా సానుభూతితో చూసి చికిత్స అందించాలని సూచించారు. పేషెంట్లను సగం చికిత్సలోనే డిశ్చార్జ్ చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ప్రభుత్వ హాస్పిటళ్ల మధ్య సమన్వయం ఉండాలని, ఎమర్జెన్సీ వార్డుల్లో బెడ్లు నిండినపుడు పేషెంట్లను మరో ప్రభుత్వ హాస్పిటల్‌కు రిఫర్ చేసి అడ్మిట్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పేషెంట్‌ను రిఫర్ చేసే ముందు ప్రాథమిక చికిత్స చేసి, అవసరమైతే అంబులెన్స్‌లో డాక్టర్‌తో పంపించాలని సూచించారు. డ్యూటీ డాక్టర్లు, ఆర్ఎంవోలు పేషెంట్ల అడ్మిషన్, రిఫరల్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.



# విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

మొదటిపేజీ తరువాయి

చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీకి ప్రత్యేక కానుక

- జపాన్ పర్యటనలో 'దరుమా' బొమ్మను బహూకరించిన ఆలయ ప్రధాన పూజారి
- పట్టుదలకు, అదృష్టానికి చిహ్నంగా భావించే బొమ్మ
- భారతీయ బౌద్ధ సన్యాసి బోధిధర్ముడికి ప్రతీక ఈ దరుమా
- కాంచీపురానికి చెందిన బోధిధర్ముడి నుంచే ఈ సంప్రదాయం

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన జపాన్ పర్యటనలో భాగంగా తొలిరోజునే ఒక ప్రత్యేకమైన బహుమతిని అందుకున్నారు. జపాన్ సంస్కృతిలో విశిష్ట స్థానమున్న 'దరుమా బొమ్మ'ను దరుమాజీ ఆలయ ప్రధాన పూజారి రెవ్ సైషీ హిరోసే ఆయనకు బహూకరించారు. చూడటానికి సాధారణ బొమ్మలా కనిపించినప్పటికీ, దీని వెనుక ఉన్న చరిత్ర, దీని మూలాలు భారత దేశంతో ముడిపడి ఉండటం విశేషం.

**ఏమిటీ దరుమా బొమ్మ ప్రత్యేకత?**

జపాన్‌లో దరుమా బొమ్మను పట్టుదలకు, అదృష్టానికి చిహ్నంగా భావిస్తారు. కాగితపు గుజ్జుతో తయారుచేసే ఈ బొమ్మను లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, వాటిని సాధించడానికి ఒక సంకేతంగా ఉపయోగిస్తారు. దీని కింది భాగం గుండ్రంగా ఉండటం వల్ల, కింద పడేసినా వెంటనే తిరిగి లేచి నిలబడుతుంది. "ఏడుసార్లు పడినా, ఎనిమిదోసారి లేచి నిలబడాలి" అనే జపాన్ సామెతకు ఇది ప్రతిరూపంగా నిలుస్తుంది. ఆ దేశ సంప్రదాయం ప్రకారం, ఏదైనా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు ఈ బొమ్మకు ఒక కన్ను దిద్దుతారు. ఆ లక్ష్యం లేదా కోరిక నెరవేరిన తర్వాత రెండో కన్ను వేసి తమ విజయాన్ని పూర్తిచేస్తారు.

**భారతదేశంతో విడదీయరాని బంధం**

ఈ బొమ్మకు స్ఫూర్తి మన దేశానికి చెందిన బౌద్ధ సన్యాసి బోధిధర్ముడు. 5వ శతాబ్దానికి చెందిన బోధిధర్ముడు కాంచీపురంలో జన్మించారు. ఆయన జెన్ బౌద్ధమత స్థాపకుడిగా ప్రసిద్ధి చెందారు. జపాన్‌లో ఆయన్ను 'దరుమా దైషి'గా ఎంతో గౌరవిస్తారు. చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో ఒక గుహలో ఆయన చేతులు, కాళ్లు ముడుచుకుని ఏకధాటిగా తొమ్మిదేళ్లపాటు ధ్యానం చేశారని చెబుతారు. ఆయన ధ్యాన భంగిమకు ప్రతీకగానే ఈ బొమ్మకు కాళ్లు, చేతులు లేకుండా గుండ్రంగా రూపొందించారు. సంస్కృతంలోని 'ధర్మ' అనే పదం నుంచే 'దరుమా' అనే పేరు వచ్చిందని కూడా చెబుతారు. ఒక భారతీయ సన్యాసి స్ఫూర్తితో జపాన్‌లో ఒక సాంస్కృతిక చిహ్నం రూపుదిద్దుకోవడం ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# యువతులు, మహిళలను తాకుతూ శునకానందం

- మొబైల్ ఫోన్‌తో రికార్డ్ చేసిన మహిళ
- బైక్ నెంబర్ ఆధారంగా యువకుల గుర్తింపు
- వందలాది మంది ఆకతాయిలపై కేసులు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్‌లో పోకిరీల ఆగడాలు మితిమీరాయి. బోనాలు.. వినాయక వేడుకలు.. దేవీ నవరాత్రులు.. న్యూ ఇయర్.. హోలీ.. సందర్భమేదైనా సరే ఆకతాయిల టార్గెట్ అంతా అమ్మాయిలపైనే. కామెంట్ చేయడం.. యువతులను, మహిళలను తాకుతూ, వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. శునకానందం పొందుతున్నారు. తాజాగా బైక్ వెళ్తున్న మహిళలను.. యువకులు వెంబడిస్తూ నెమలి ఈకతో టచ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తించారు. వైరల్ ఐన వీడియో ఆధారంగా యువకులను గుర్తించి పట్టుకుని తాట తీశారు పోలీసులు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా తాజాగా జరిగిన బోనాల ఉత్సవాల్లో ఆకతాయిలు రెచ్చిపోయారు. యువతులు, మహిళలను తాకుతూ శునకానందం పొందారు. ఇందులో యువకులే కాదు.. అంకుల్స్ కూడా ఉన్నారు. ఇలాంటి వాళ్లందరి తాట తీశారు పోలీసులు. వాళ్లు చేస్తున్న వికృత చేష్టలను షీ టీమ్స్ వీడియోలతో సహా రికార్డ్ చేసింది. గుర్తించి పట్టుకుని కేసులు నమోదు చేశారు పోలీసులు. ఇలా బోనాలు ముగిసే వరకు వందలాది మంది ఆకతాయిలపై కేసులు పెట్టారు. తాజాగా మాదాపూర్‌లో కుర్రాళ్లు రెచ్చిపోయారు. బైక్ వెళ్తున్న యువతులను.. ముగ్గురు యువకులు బైక్‌పై వెంబడించడమే కాకుండా... వెనక కూర్చున్న యువకుడు నెమలి ఈకతో యువతులను కొడుతూ వేధించాడు. ఇలా కొద్ది దూరం వరకు వెంబడించి యువతులతో అసభ్యంగా ప్రవర్తించారు. ముగ్గురు యువకుల ప్రవర్తనతో భయాందోళనకు గురైన యువతులు బైక్‌ను వేగంగా పోనిచ్చే ప్రయత్నం చేశారు. ఐనా యువకులు వెంబడించారు. ఈ తతంగం అంతా... వెనకాలే వస్తున్న కారులోని మహిళ తన మొబైల్ ఫోన్‌తో రికార్డ్ చేసింది. యువకుల బైక్ సమీపం వరకు వెళ్లి.. వారించింది. ఏం చేస్తున్నారు.. అంటూ మందలించింది. దీంతో ఆ ముగ్గురు యువకులు స్పీడ్‌గా వెళ్లిపోయారు. మొబైల్ ఫోన్‌తో రికార్డ్ చేసిన మహిళ.. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. పోలీసులకు ట్యాగ్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోను గుర్తించిన పోలీసులు.. ఆ బైక్ నెంబర్ ఆధారంగా యువకులను గుర్తించారు. వరంగల్ కి చెందిన ముగ్గురు యువకులు.. హైదరాబాద్‌లోనే ఉంటున్నట్లు గుర్తించారు. చదువు, ఉద్యోగం లేకుండా.. జులాయిగా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న మాదాపూర్ పోలీసులు.. యువకుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు పోలీసులు. ముగ్గురిపై కేసులు నమోదు చేశారు పోలీసులు. ఎవరూ గమనించరు కదా అని తుంటరి చేష్టలకు పాల్పడినా.. యువతులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా తాట తీస్తామని హెచ్చరిస్తున్నారు పోలీసులు. రానున్న వినాయక నిమజ్జనం, దేవీ నవరాత్రుల ఉత్సవాల్లోనూ ఇలాంటి చేష్టలకు పాల్పడే వాళ్లపై పోలీసుల నజర్ ఉంటుందని.. పిచ్చి చేష్టలకు పాల్పడితే కేసులు తప్పవని వార్నింగ్ ఇస్తున్నారు.

# హైదరాబాద్ సరూర్ నగర్‌లో వెలుగుచూసిన దారుణ హత్య

- నిద్రలో చనిపోయాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం
- అనుమానంతో విచారించగా నేరం అంగీకరించిన నిందితురాలు
- భార్యను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న ప్రియుడి కోసం గాలింపు

**హైదరాబాద్, ప్రజాస్వరం**

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తనే ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసిందో భార్య. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు, తన భర్త నిద్రలోనే ప్రాణాలు విడిచాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. ఈ దారుణ ఘటన హైదరాబాద్‌లోని సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సరూర్ నగర్‌లోని కోదండరాం నగర్ రోడ్డు నెం.7లో జెల్లెల శేఖర్ (40), అతని భార్య చిట్టి (33) నివాసం ఉంటున్నారు. శేఖర్ డ్రైవర్ కాగా, చిట్టి ఇళ్లల్లో పని చేస్తోంది. కొంతకాలంగా చిట్టికి హరీశ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తను అడ్డు తొలగించుకోవాలని చిట్టి తన ప్రియుడు హరీష్‌తో కలిసి ప్రణాళిక వేసింది. పథకం ప్రకారం, అర్ధరాత్రి భర్త శేఖర్ గాఢ నిద్రలో ఉన్నప్పుడు చిట్టి తన ప్రియుడు హరీశ్‌ను ఇంటికి పిలిపించింది. అనంతరం ఇద్దరూ కలిసి శేఖర్‌ను హత్య చేశారు. ఉదయం నిద్రలేచిన తర్వాత, తన భర్త నిద్రలోనే మరణించాడంటూ డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు శేఖర్ మృతిపై అనుమానం కలిగింది. దీంతో వారు తమదైన శైలిలో చిట్టిని విచారించగా, ఆమె అసలు నిజాన్ని బయటపెట్టింది. తన ప్రియుడు హరీశ్‌తో కలిసి తానే భర్తను హత్య చేసినట్లు నేరం అంగీకరించింది. దీంతో పోలీసులు చిట్టిని అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న ఆమె ప్రియుడు హరీశ్ కోసం గాలిస్తున్నారు.

# 2.2 లక్షల ఎకరాల్లో పంట నష్టం

మొదటిపేజీ తరువాయి

ప్రభావితమయ్యాయి. మొత్తం 20,983 ఎకరాల్లో సోయాబీన్ పంటలు దెబ్బతిన్నాయి. ఇక హార్టికల్చర్ పంటలు 639 ఎకరాల్లో, ఇసుక మెటల వల్ల 6,003 ఎకరాల్లో పంటలు నష్టపోయాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ భారీ పంట నష్టంపై ప్రభుత్వం త్వరలోనే తదుపరి చర్యలు చేపట్టనుంది.






# జీఎస్టీ రేషనలైజేషన్‌తో రాష్ట్రానికి భారీ నష్టం

మొదటిపేజీ తరువాయి

బాగుంటేనే దేశం బాగుంటుంది. కేంద్రం ఫెడరల్ స్ఫూర్తితో వ్యవహరించాలి. రేషనలైజేషన్‌ను మేము ఆహ్వానిస్తున్నాం కానీ, రాష్ట్రాలకు జరిగే నష్టానికి తగిన నష్టపరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలి" అని స్పష్టం చేశారు. జీఎస్టీ ద్వారా రాష్ట్రాలకు వచ్చే ఆదాయంపై ఎన్నో ప్రణాళికలు ఆధారపడి ఉంటాయని భట్టి గుర్తుచేశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. తెలంగాణకే సుమారు 7 వేల కోట్ల రూపాయల నష్టం తలెత్తే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీని అమలు చేసే సమయంలో కేంద్రం రాష్ట్రాలకు కనీసం 14 శాతం వృద్ధి హామీ ఇస్తామని చెప్పినా, వాస్తవానికి ఇప్పటికీ 7 శాతం మాత్రమే వృద్ధి వస్తోందని భట్టి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, సెస్ రూపంలో వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎనిమిది రాష్ట్రాలు ఏకగ్రీవంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని నిర్ణయించాయి. సెప్టెంబర్ 3న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ డిమాండ్లను లేవనెత్తాలని నిర్ణయించారు. అలాగే, అదే రోజు మళ్లీ ఆర్థిక మంత్రుల సమావేశం ఢిల్లీలో జరగనుంది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ వ్యూహం

మొదటిపేజీ తరువాయి

ప్రాధాన్యంగా తీసుకున్న రాష్ట్ర బీజేపీ, ఈ ఎన్నికను సమర్థంగా సమన్వయం చేసేందుకు ఉప ఎన్నిక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ప్రకటించారు. పార్టీ అభ్యర్థి ఎంపిక నుండి, బూత్ స్థాయి కార్యకలాపాల వరకు ఎన్నికల వ్యూహాలను సమన్వయం చేయడం, స్థానిక సమస్యలను సేకరించడం, ప్రచారాన్ని సమర్థవంతంగా నడిపించడం వంటి బాధ్యతలను ఈ కమిటీ చేపట్టనుంది. ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ ఎం. రఘునందన్ రావు, మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావులతో ఈ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా జూబ్లీహిల్స్ ప్రాంతంలో బీజేపీ బలాన్ని పెంచడం, స్థానిక ప్రజల సమస్యలను పార్టీ వైఖరితో అనుసంధానం చేయడం, బూత్ స్థాయి నాయకత్వం నుండి పై స్థాయి సమన్వయం వరకూ కచ్చితమైన పర్యవేక్షణ కొనసాగించనుంది. హైదరాబాద్ నగరంలోనే కాకుండా తెలంగాణ రాజకీయాల్లోనూ జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. విద్యావంతుల ప్రాంతం కావడంతో పాటు వ్యాపారవేత్తలు, ఐటీ ప్రొఫెషనల్స్, మధ్యతరగతి ఓటర్ల ఆధిపత్యం ఉన్న ఈ ప్రాంతంలో ఎన్నికలు ఎప్పుడూ కఠినంగానే జరుగుతాయి. గతంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడూ ఈ నియోజకవర్గంలో తమ ప్రాతినిధ్యం కోసం పోరాడిన ఉదాహరణలు ఉన్నాయి. ప్రస్తుతం ఉప ఎన్నిక నేపథ్యంలో, బీజేపీకి ఇది ఒక అవకాశం. 2028 ఎన్నికల దిశగా హైదరాబాద్‌లో తన పట్టు పెంచుకోవాలని ఆశిస్తున్న బీజేపీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వెనుక కారణం అదే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి శక్తివంతమైన క్యాడర్ ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ స్థానిక స్థాయిలో బలంగా ఉండటం, కాంగ్రెస్ కూడా మళ్లీ ఈ సీటు కోసం యాక్టివ్ అవ్వడం, ఎన్నికను త్రిముఖ పోరుగా మార్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంతేకాకుండా, మైనారిటీ ఓటర్ల ప్రాధాన్యం కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశంగా ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను గెలుచుకోవడానికి బీజేపీ సమగ్రమైన వ్యూహంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పాటు చేసిన ఐదుగురి కమిటీ ఈ వ్యూహానికి మద్దతుగా పనిచేయనుంది. ఈ ఉప ఎన్నికలో బీజేపీ గెలిస్తే, అది హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది.

# వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి





- **సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపురావు**

**ఢిల్లీ, ప్రజాస్వరం :**

ఢిల్లీ - బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున సుప్రీం కోర్టులో సీనియర్ అడ్వకేట్ అల్లంకి రమేష్ పిటిషన్ దాఖలు చేశారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కారని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వచ్చి, అప్పటి నుంచి గిరిజనుల హక్కులను కొల్లగొడుతున్నారని పిటిషనర్లు తమ పిటిషన్ లో పేర్కొన్నారు. వాస్తవానికి మొదట బంజారా, లంబాడా, సుగాలీలు బిసి జాబితాలో ఉన్నారని కోర్టులో వేసిన పిటిషన్ లో తెలిపారు. పిటిషన్ విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ జె కే మహేశ్వరి, జస్టిస్ బిష్ణోయ్ ధర్మాసనం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో రిజైండర్ దాఖలు చెయ్యాలని ఆదేశాలు జారీ చేసింది సుప్రీం కోర్టు.

## సీఎస్ పదవీ కాలం పొడిగింపు..

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు పదవీ కాలం పొడిగించింది కేంద్రం. మరో ఏడు నెలల పాటు సీఎస్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 మార్చి నెల వరకు పదవీ కాలం పొడిగించింది. ఈ నెల 31న రామకృష్ణా రావు పదవీ విరమణ చేయాల్సి ఉండగా ఆయన సర్వీసు పొడిగించాలని డివోపిటిని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో మరో 7 నెలలు సర్వీసు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. ఏఐఎస్ (సీఎస్-ఆర్ఎం) రూల్స్-1960లోని రూల్-3ని ప్రయోగించడం ద్వారా ఏఐఎస్ (డీసీఆర్బీ) రూల్స్‌లోని 16(1) నిబంధనను సడలిస్తూ రామకృష్ణారావు సర్వీసును పొడిగించినట్టు కేంద్రం తెలిపింది. 1991 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన రామకృష్ణారావు గత ఏప్రిల్ 30న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.



# భారీ వరదలో బోటు బోల్తా


## మెదక్ జిల్లాలో ఆర్మీ జవాన్లకి తప్పిన ప్రమాదం

**మెదక్, ప్రజాస్వరం :**

మెదక్ జిల్లాలో ఆర్మీ జవాన్లకి పెను ప్రమాదం తప్పింది. రెస్క్యూ కోసం ట్రయల్ వేస్తుండగా బోటు బోల్తా పడింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది జవాన్లను రక్షించేందుకు రంగంలోకి దిగారు. తాళ్ల సాయంతో జవాన్లను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కాగా ఈ నెల 27న వినాయకుని విగ్రహం కొనుగోలు చేసేందుకు కామారెడ్డి జిల్లా లింగంపల్లి గ్రామానికి చెందిన 8 మంది చిన్నారులు మెదక్ కు వచ్చారు. భారీగా కురిసిన వర్షాలతో పోచారం వరద ఎక్కువ కావడంతో మూడు రోజులుగా పోచమ్మరాల్ గ్రామంలో చిన్నారులు తలదాచుకున్నారు. మూడు రోజులుగా గ్రామస్థులు 8 మంది చిన్నారుల ఆలన పాలన చూసుకున్నారు. ఈ క్రమంలో చిన్నారులను ఆర్మీ అధికారులు వారి ఇంటికి పంపేందుకు ప్రయత్నం చేయగా విఫలం అయ్యింది. దీంతో తిరిగి మెదక్ లోని పునరావాస కేంద్రానికి చిన్నారులను తరలించారు. కాగా మెదక్ జిల్లాలో కుండపోత వర్షాలు వణికించిన విషయం తెలిసిందే. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి.




# హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు



- **గణేష్ నిమజ్జనం కోసం నగరంలో ట్రాఫిక్ దారి మళ్లింపు**
- **సెప్టెంబర్ 5 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి అర్ధరాత్రి వరకు పరిమితులు**
- **కీలక జంక్షన్ల వద్ద వాహనాల మళ్లింపు – ప్రత్యామ్నాయ మార్గాలు సూచించిన పోలీసులు**
- **అవసరమైతే మాత్రమే నిమజ్జన ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

నగరంలో గణేష్ నిమజ్జన మహోత్సవాలను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేస్తున్నారు. నేటి (ఆగస్టు 29) నుండి సెప్టెంబర్ 5 వరకు ఈ ఆంక్షలు కొనసాగనున్నాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి అర్ధరాత్రి వరకు వాహన రాకపోకలపై పరిమితులు ఉండనున్నాయి. పోలీసుల ప్రకారం, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, పీవీఎన్ఆర్ మార్గ్ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో భారీగా వాహనాల రాకపోకలు ఉండే అవకాశం ఉన్నందున మోటార్ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

**వాహనదారులకు సూచనలు**

నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకించి పీక్ టైమ్‌లో వాహనాలు తీసుకెళ్లేటప్పుడు ఆంక్షలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు గణేష్ నిమజ్జన ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు నగరవాసులకు "అవసరమైతే మాత్రమే నిమజ్జన ప్రాంతాలకు వెళ్లండి. ట్రాఫిక్ ఆంక్షలను గౌరవించండి. పోలీసులకు సహకరించండి" అని విజ్ఞప్తి చేశారు.

### ప్రధాన రూట్లపై ఆంక్షలు

**సెయిలింగ్ క్లబ్ జంక్షన్, వీవీ విగ్రహం, తెలుగు తల్లి జంక్షన్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ ఎక్స్ రోడ్, నల్లగుట్ట బ్రిడ్జి, బుద్ధభవన్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.**

**అప్పర్ ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్ మీద అవసరాన్ని బట్టి వాహనాలను అడ్డుకోవచ్చు.**

**లిబర్టీ, ఖైరతాబాద్, సికింద్రాబాద్, పంజాగుట్ట వైపు వచ్చే వాహనదారులు కవాడిగూడ, బేగంపేట్, మినిస్టర్ రోడ్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.**

# ప్రయాణికులకు బిగ్ అలర్ట్

- **నార్సింగి ఔటర్ సర్వీస్ రోడ్డు, ఔటర్ ఎంట్రీ, ఎగ్జిట్ మూసివేత**

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

తెలంగాణలో కురుస్తున్న కుండపోత వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. భారీ వరదల కారణంగా రోడ్లు ధ్వంసం అయ్యాయి. రాకపోకలకు తీవ్ర అంతారంయ ఏర్పడింది. ఇక ఇప్పుడు నార్సింగి ఔటర్ సర్వీస్ రోడ్డు, ఔటర్ ఎంట్రీ, ఎగ్జిట్ మూసివేశారు అధికారులు. ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని ప్రయాణికులకు సూచించారు. ఉస్మాన్ సాగర్ 8 గేట్లు ఎత్తి 3000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు అధికారులు. దీంతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మంచిరేవుల బ్రిడ్జి పైనుంచి మూసీ నది ప్రవహిస్తోంది. దీంతో మంచిరేవుల - నార్సింగికి రాకపోకలు నిలిపివేశారు అధికారులు.




# ఖిలావరంగల్ తహసీల్దార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**వరంగల్, ప్రజాస్వరం :**

వరంగల్ జిల్లా ఖిలావరంగల్ తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు చేశారు. హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఆయన ఇంటిపై వరంగల్ ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సోదాలు జరుపుతున్నారు. తహసిల్దార్ నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మంలో సైతం ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బండి నాగేశ్వర్ రావు గతంలో ధర్మసాగర్, కాజీపేట, హసన్ పర్తి మండలాల్లో తహసిల్దారుగా పనిచేశారు. ఆ సమయంలో ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టినట్లు తెలిసింది. సోదాల్లో భారీగా నగలు పట్టుబడుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## ఎంజేపీ మియాపూర్ గురుకులంలో
# గణనాథుడికి పూజలు

**చేవెళ్ల, మొయినాబాద్, ఆగస్టు 29 (ప్రజాస్వరం) :**
మోహినాబాద్ బీసీ గురుకులం మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ జంగం నరేష్, బిఏ అమినేషన్, విద్యార్థులు,మట్టి తో తయారుచేసిన గణనాథుడికి ఉపాధ్యాయ బృందం, మరియు విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ప్రిన్సిపాల్ జంగం నరేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులు విద్యార్థుల పైన ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విద్యార్థులు పరీక్ష లో మంచి ఫలితాలు తీసుకురావాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- **అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వండి**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**



**మెదక్, ఆగస్టు 29 (ప్రజా స్వరం) :**
గత రెండు రోజులుగా మెదక్ జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా రక్షణ చర్యలను ప్రత్యక్షంగా మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు పర్యవేక్షించారు. శుక్రవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో మొదటిసారిగా వినాయకుడి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచే బాధ్యతను పోలీసులు సమర్థవంతంగా నిర్వర్తించేలా ఆశీర్వదించామని కోరుకున్నట్లు తెలిపారు. ఎస్డిఆర్ఎఫ్, ఎన్టీఆర్ ఎఫ్, పోలీస్ బృందాలు సమన్వయంతో పని చేసి అనేక ప్రాణాలను రక్షించారని అన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినా చెరువులు, వాగులు, నదులు ఇంకా ప్రమాదకరంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ కృషి చేస్తారని, ఎలాంటి సహాయం కావాలన్నా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# నాకు బాస్‌లు ఎవరూ లేరు

- **స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి వెళ్తాను**
- **తెలంగాణలో బీజేపీ భ్రష్టు పట్టింది**
- **గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
తెలంగాణ శాసనసభ సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను అసెంబ్లీకి స్వతంత్ర సభ్యుడిగానే హాజరవుతానని, ఇకపై తనను ఎవరూ కట్టడి చేయలేరని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని రాజాసింగ్ తీవ్రంగా విమర్శించారు. పార్టీలోని కొందరు నేతల వైఖరి వల్లే ఈ దుస్థితి దాపురించిందని, వారి వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. "ఇప్పుడు నాకు ఎవరూ బాస్‌లు లేరు. నన్ను ఎవరూ అదుపు చేయలేరు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం దొరికింది" అని రాజాసింగ్ అన్నారు. తానుగా మళ్లీ బీజేపీలో చేరే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. కేవలం పార్టీ జాతీయ నాయకత్వం నుంచి పిలుపు వస్తేనే తిరిగి చేరికపై ఆలోచిస్తానని చెప్పారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు అసెంబ్లీ సమావేశాల ముందు బీజేపీలో కలకలం రేపాయి.




# రామసేతుకు జాతీయ హోదా

- **కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు**
- **రామసేతుకు జాతీయ హోదాపై సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్**
- **విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు**
- **కేంద్ర సాంస్కృతిక శాఖ, పురావస్తు శాఖకు నోటీసులు**
- **తన విజ్ఞప్తిపై కేంద్రం నిర్ణయం తీసుకోవడం లేదని స్వామి ఆరోపణ**
- **గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించాలని పిటిషన్‌లో అభ్యర్థన**
- **నిర్ణీత సమయంలోగా దీనిపై తేల్చాలని కోర్టుకు విజ్ఞప్తి**

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**
రామసేతువును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై సుప్రీంకోర్టు కీలక ముందడుగు వేసింది. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నిర్దిష్ట సమయంలోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ స్వామి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) డైరెక్టర్, ఏఎస్ఐ తమిళనాడు ప్రాంతీయ డైరెక్టర్ ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. స్వామి తరఫున సీనియర్ న్యాయవాది విభా దత్తా మఖిజా, న్యాయవాది సత్య సబర్వాల్ వాదనలు వినిపించారు. రామసేతువును జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించే విషయంలో తన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రామసేతువుకు సంబంధించిన మతపరమైన, చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి, దాని పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఈ విషయంపై గత ఏడాది జనవరిలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వానికి మరిన్ని పత్రాలు సమర్పించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో, మే 13న మళ్లీ కేంద్ర సాంస్కృతిక మంత్రికి విజ్ఞప్తి చేసి, తాజాగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

# ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకు సాగాలి

## ఎంపీ ఈటల రాజేందర్




**జవహర్ నగర్, ఆగస్టు 29, (ప్రజాస్వరం ):**
ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు విద్యార్థులు ముందుకు సాగాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మహిత ఎన్జీవో సహకారంతో సి ఎస్ ఆర్ నిధులతో పాఠశాల విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్, ఫర్నిచర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కార్పొరేట్ సంస్థలు చేయితనందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థలో ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ వసంత,జవహర్ నగర్ బిజెపి అధ్యక్షుడు కమల్, నాయకులు విక్రమ్ రెడ్డి, మహేందర్ యాదవ్, సంతోష్ గుప్తా,కుర్ర రాజు,రంగుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# సుగాలి ప్రీతి కేసు.. జనసేన స్పందన

- **కేసును పవన్ పట్టించుకోవడం లేదని సుగాలి ప్రీతి తల్లి ఆరోపణ**
- **పవన్ కల్యాణ్ వల్లే ఈ కేసు వెలుగులోకి వచ్చిందన్న జనసేన**
- **గతంలో పవన్ చేసిన పోరాటాన్ని గుర్తు చేసిన వైనం**

**ఏపీ బ్యూరో, ప్రజాస్వరం :**
కర్నూలుకు చెందిన సుగాలి ప్రీతి హత్య కేసు వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కేసును పట్టించుకోవడం లేదని ప్రీతి తల్లి పార్వతి చేసిన ఆరోపణలపై జనసేన పార్టీ ఘాటుగా స్పందించింది. పవన్ కల్యాణ్ అనే వ్యక్తి గొంతెత్తకపోయి ఉంటే, ఈ కేసు ఎప్పుడో మరుగున పడిపోయేదని పేర్కొంది. సాయం పొందిన వారు కృతజ్ఞత చూపకపోవడం కూడా తప్పే అవుతుందని వ్యాఖ్యానించింది. జనసేన విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 2017 ఆగస్టులో సుగాలి ప్రీతి హత్య జరగ్గా, ఈ ఘటన 2019 డిసెంబర్‌లో తొలిసారి పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. 2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, బాధితురాలి తల్లిదండ్రులు పార్టీ కార్యాలయానికి వచ్చి మొరపెట్టుకోగానే పవన్ చలించిపోయారని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతానని హామీ ఇచ్చారని జనసేన గుర్తు చేసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ కేసుపై అసెంబ్లీలో చర్చించాలని, లేదంటే కర్నూలులో భారీ నిరసన చేపడతామని హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించింది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో, 2020 ఫిబ్రవరి 12న 'ర్యాలీ ఫర్ జస్టిస్' పేరుతో పవన్ కల్యాణ్ కర్నూలులో భారీ ర్యాలీ నిర్వహించారని జనసేన తెలిపింది. ఆ సభలో సుగాలి ప్రీతి తల్లి పార్వతి మాట్లాడుతూ, తమ బిడ్డకు న్యాయం కోసం గళం విప్పిన మొదటి నాయకుడు పవన్ కల్యాణే అని ఎన్నోసార్లు చెప్పారని పేర్కొంది. పవన్ ఒత్తిడి కారణంగానే నాటి వైసీపీ ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 27న కేసును సీబీఐకి బదిలీ చేస్తూ జీవో జారీ చేసిందని వివరించింది. అయితే, జీవో ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్లే సీబీఐ విచారణ ముందుకు సాగలేదని జనసేన ఆరోపించింది. అధికారంలోకి వచ్చాక కూడా పవన్ ఈ కేసును మర్చిపోలేదని, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రీతి తల్లిదండ్రులను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారని తెలిపింది. విచారణ వేగవంతం చేయాలని హోంమంత్రి అనితకు సూచించారని, ఆమెను కలవమని బాధితులకు చెప్పారని పేర్కొంది. పవన్ చొరవతోనే ఈ కేసు ఇంతవరకైనా వచ్చిందని, అలాంటి వ్యక్తిని ఇప్పుడు ప్రశ్నించడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని జనసేన ఆవేదన వ్యక్తం చేసింది.





# ఏపీకి లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

- **ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు**
- **దేశానికి ఫ్రూట్ కేపిటల్, ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ఉందన్న ముఖ్యమంత్రి**
- **రూ. 200 కోట్లు దాటిన ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడి**
- **175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్న సీఎం**
- **'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కింద ముందుకు రావాలని యువతకు పిలుపు**



**ఏపీ బ్యూరో, ప్రజాస్వరం :**
ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఈ రంగంలో ఏకంగా లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. విశాఖలో జరిగిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలు, ప్రభుత్వ పాలసీల గురించి వివరించారు. ప్రస్తుతం దేశ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 35 శాతంగా ఉందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందని అన్నారు. ఇప్పటికే 'ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన ఏపీ, దేశానికే 'ఆక్వా హబ్'గా కూడా నిలుస్తోందని ఆయన గుర్తుచేశారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం 'ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0'ను అమలు చేస్తోందని చంద్రబాబు వివరించారు. రూ. 200 కోట్లకు పైబడిన పెట్టుబడులను 'మెగా ప్రాజెక్టు'లుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. కేవలం పెట్టుబడులే కాకుండా, ఆవిష్కరణలకు కూడా పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. అగ్రిటెక్ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో, ఆవిష్కరణల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందిస్తాయని భరోసా ఇచ్చారు. మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లను అందిపుచ్చుకుంటూ, ప్రపంచస్థాయి బ్రాండ్లను భారతదేశం నుంచి తయారు చేయాలన్నదే తమ ఆశయమని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా, సుస్థిరంగా మార్చడమే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఏపీ చాప్టర్ ఏర్పాటు కానుండటం సంతోషకరమని అన్నారు.

# జగన్ కోసమే మోదీ సీబీఐ గొంతు నొక్కారు

- **ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు**

**ఏపీ బ్యూరో, ప్రజాస్వరం :**
తన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి జగన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడని, అందుకే జగన్‌ను, ఆయన సోదరుడు అవినాశ్ రెడ్డిని కాపాడటం కోసం మోదీ సీబీఐ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసు దర్యాప్తును ప్రస్తావిస్తూ, ఈ కేసులో మళ్లీ విచారణ ఎందుకు చేపట్టరని ప్రభుత్వాన్ని షర్మిల సూటిగా ప్రశ్నించారు. "వై నాట్?" అంటూ నిలదీశారు. ఇన్నేళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా కుమార్తె సునీత చేస్తున్న పోరాటంలో పూర్తి న్యాయం ఉందని, ఆమెకు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ పనితీరుపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "సీబీఐ అనేది మోదీ చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. నిజంగా సీబీఐ చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే ఈపాటికే దోషులకు శిక్ష పడేది" అని అన్నారు. హత్య జరిగినప్పుడు సంఘటనా స్థలంలో అవినాశ్ రెడ్డి ఉన్నారని చెప్పడానికి గూగుల్ మ్యాప్ లొకేషన్లతో సహా బలమైన ఆధారాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇన్ని సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, అవినాశ్ రెడ్డిని కాపాడటానికే దర్యాప్తును నీరుగారుస్తున్నారని ఆమె ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదని సునీత చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉందని షర్మిల పేర్కొన్నారు.





## మానేరులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీం

**రాజన్న సిరిసిల్ల, ప్రజాస్వరం**

ఐదు శాఖల అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ.. ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీంను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య బుధవారం గల్లంతు అయ్యారు. ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, నీటి పారుదల, మత్స్య శాఖ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎగువ మానేరు ప్రవహించే మండలాల్లోని చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు, కల్వర్టులు ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. నర్మాల నుంచి గంభీరావుపేట వరకు, గంభీరావుపేట నుంచి మల్లారెడ్డిపేట వరకు, మల్లారెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు, వెంకటాపూర్ నుంచి సిరిసిల్ల వరకు, సిరిసిల్ల నుంచి మధ్య మానేరు రిజర్వాయర్ వరకు వెతకాలని ఒక్కో ప్రాంతానికి ఐదుగురితో కలిపి ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ సభ్యులు వెంటనే తమ విధి నిర్వహణను మొదలు పెట్టాలని ఆదేశించారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- **కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల**

ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కన్నేపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం వైద్యరంగ బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ఆసుపత్రులు సామాజిక ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాలుఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి మెరుగైన వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణ దిశగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ప్రత్యేక ఫీవర్ వార్డులు ఏర్పాటు చేసి జ్వర బాధితులకు వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారుఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జమ్మికుంటలో యువ సామ్రాట్ అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు

**జమ్మికుంట,**

యువ సామ్రాట్ అక్కినేని నాగార్జున 66వ, జన్మదిన వేడుకలను జమ్మికుంట పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్లో డాన్ రమేష్, ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, యువ సామ్రాట్ అక్కినేని నాగార్జునకు వీరాభిమాని అయిన డాన్ రమేష్,మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీలో నూతన డైరెక్టర్లను ప్రోత్సహించడంలో అక్కినేని నాగార్జున, ముందు ఉంటాడని అలాగే రానున్న రోజుల్లో మంచి సినిమాల్లో నటిస్తూ గొప్ప పేరు ప్రతిష్టలు పొందాలని ఆయురారోగ్యాలతో సుఖసంతోషాల్లో ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్జున ఫ్యాన్స్ డాన్ రమేష్, అంజి, అన్నపూర్ణ థియేటర్ మేనేజర్ తాటిపల్లి సునీల్, కుమార్, ఎల్కపల్లి రాజేష్, రామంచ శ్రీకాంత్, పొన్నగంటి సురేష్, కుమార్, ప్రశాంత్, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ ముట్టడి

**జమ్మికుంట, ప్రజాస్వరం**



న్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి, గురువారం ఉదయం రెండు గంటలు వర్షానికి అంబేద్కర్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీలలో కొన్ని ఇళ్ళలోకి వరదనీరు చేరుతుంటే వరద ముంపు భాదితులు ఫోన్ చేసిన కమిషనర్ లిఫ్ట్ చేయలేదని, బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, దృష్టికి భాదితులు తీసుకురాగా, స్పందించి కమిషనర్ కి ఫోన్ చేస్తే స్పందించలేదని, వరద ముంపు భాదితులు పెట్టిన వీడియోలు వివిధ ప్రెస్ గ్రూపులో కొలకాని రాజు పోస్ట్ చేయగా, ఆ వీడియో చూసిన కమిషనర్ బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు కి ఫోన్ చేసి నిర్లక్ష్యంగా మాట్లాడుతూ, నువ్వు డబ్బులు ఇవ్వు అభివృద్ధి చేస్తా, అంటూ వ్యంగ్యంగా మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని మున్సిపల్ ఆఫీస్ ముట్టడి చేసి ధర్నా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కమిషనర్ బయటకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, ఈసందర్భంగా పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, మాట్లాడుతూ గత సంవత్సరం, ఈ సంవత్సరానికి ముందే రెండు సంవత్సరాల పన్ను వసూలు చేసి రాష్ట్రంలోనే పన్ను వసూలులో మొదటి స్థానంలో నిలిచిందని, మూడు కోట్ల రూపాయలు పారితోషికం తీసుకున్న అని గొప్పలు చెప్పుకొంటున్న కమిషనర్ , ఈ మూడు నెలలుగా ఒక్క రూపాయి కేటాయించి కొత్తగా కాలువలు నిర్మించ లేరా? వరద ముంపు ప్రాంతాల్లో అభివృద్ధి చేయడం నీకు ఇష్టం లేదా,? లేక కమిషన్లు వచ్చే పనులే చేస్తారా అని నిలదీశారు, నిన్న మీరు ఫోన్ లో డబ్బులు ఇవ్వు పనులు చేస్తా అని అడగడం, నువ్వు అధికారివా, లేకా రాజకీయ నాయకుడివా అని ఎద్దేవా చేశారు, నీకు అభివృద్ధి పనులు కావాలంటే ఆఫీసులో కూర్చోవడం కాదు, ప్రభుత్వం దృష్టి కి తీసుకుపోవాలని కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ని కలిసి నిధులు తెచ్చుకోవాలని సలహా ఇచ్చారు, ఇప్పటికైనా ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ఇంకా ప్రజలను కలుపుకుని ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, రమా రెడ్డి, దొంతుల రాజ్ కుమార్, పల్లపు రవి, కైలాసకోటి గణేష్, బచ్చు శివన్న, మోతె స్వామి, ఇటుకాల స్వరూప, నిరుపరాణి, కనుమల్ల లక్ష్మి, రాచపల్లి ప్రశాంత్, బూరుగుపల్లి రాము, శనిగరపు రవి, విజిగిరి రవిందర్, శ్రీవర్తి ప్రవీణ్, మురికి మహేష్, యాంసాని సమ్మయ్య, కురిమిల్ల అశోక్, ఆకుల పోచయ్య, మ్యాదరి శంకర్, విజేందర్, మంథని అశోక్, గుర్రం పరుశురాములు పాల్గొన్నారు...

## పేదలకు అశ్రయంగా ఉండడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

- **క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్**

**కమాన్ పూర్**





లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో అనవేన రాజ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా పేద కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ మిత్రుడు రాజ్ కుమార్ పుట్టిన రోజు తీసుకొన్న మంచి నిర్ణయాన్ని అభినందిస్తునమని అలాగే సమాజంలో ఎవరూ ఆకలితో ఉండకూడదు అన్నదే మా లయన్స్ క్లబ్ ప్రధాన ధ్యేయమని, వీలు అయినంత వరకు పేద కుటుంబాలకు చేయూతనివ్వడం లయన్స్ క్లబ్ యొక్క బాధ్యతగా భావిస్తున్నాము.పేద ప్రజల అండగా నిలబడటమే నిజమైన సేవ. ఇలాంటి సేవా కార్యక్రమాలు క్లబ్ సభ్యుల సహకారంతో మరింత విస్తృతంగా సేవ కార్యక్రమాలు కొనసాగిస్తాము అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శరణ్య యాదవ్ మరియు కురుమల్ల కుమార్,గడ్డి శ్రీకాంత్,కొయ్యగా సంపత్,గొల్లపల్లి అభిలాష్ గౌడ్ ,శీలం లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**మంచిర్యాల**



ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల ఇంటర్మీడియట్ డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి సందర్శించి వంటశాల సామాగ్రి నిలువ చేశారు ప్రదేశం భోజనశాల విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించి విద్యార్థులతో కలిసి ఉపహారాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ మీ భవిష్యత్తు నిర్మాణం మీ చేతుల్లోనే ఉందని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలి" అని తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు అనంతరం భీమిని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమానికి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కలెక్టర్ మాట్లాడుతూ 15 సంవత్సరాల వయసు పైబడిన నిరక్షరాస్యులైన వారందరికీ చదువు నేర్పించేందుకు వాలంటరీ టీచర్లు కృషి చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు 10వ తరగతి పూర్తి చేయని వారిని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా చదివి ఇంటర్మీడియట్ పూర్తి చేసేలాగా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలో నవభారత సాక్షరత కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని నిరక్షరాస్యతను పూర్తిగా తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని వయోజనులైన ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగా మోహన్ మండల విద్యాధికారి కృష్ణమూర్తి ఫుల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎ. పి. ఎం. బ్రహ్మయ్య, రిసోర్స్ పర్సన్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా

- **పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి**



సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గ్రామ పంచాయతీ ఓటర్ లిస్ట్, పోలింగ్ కేంద్రాల లిస్ట్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్ డేట్ చేయడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని 263 గ్రామ పంచాయతీల పరిధిలోని 2432 వార్డులలో 4,04,209 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఆగస్టు 28న విడుదల చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ వారిగా డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఈ జాబితా పరిశీలించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 లోపు తెలియజే యాలని, 31 వరకు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితా ప్రచురిస్తామని అన్నారు. ప్రతి మండలం పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2432 డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ఎంపీడీవో ఈ నెల 28న తయారు చేశారని, వీటిపై అభ్యంతరాలను 30 లోపు ఎంపిడిఓ కార్యాలయంలో అందించాలని అన్నారు. సెప్టెంబర్ 2న తుది పోలింగ్ కేంద్రాల జాబితా తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆపిల్ కిడ్స్ లో జాతీయ క్రీడా దినోత్సవం

- **సీనియర్ క్రీడాకారుడు చంద్రపాల్ కు సన్మానం.**

**గోదావరిఖని**

హాకీ క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కల్యాణ్ నగర్ లోని శ్రీ యాపిల్ కిడ్స్ స్కూల్ లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీనియర్ హాకీ క్రీడాకారుడు పోతుల చంద్రపాల్ ను కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు డాక్టర్ బాల్ త్రో పోటీ నిర్వహించి ముఖ్యఅతిథి చంద్రపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ పిల్లలు క్రీడా మైదానాల్లో కనబడడం లేదని, విద్యార్థులు స్కూల్ తర్వాత తప్పకుండా తమకు వచ్చిన, నచ్చిన ఆటలు ఆడాలని సూచించారు. పాఠశాల యాజమాన్యం క్రీడలపై ఆసక్తితో నూతనంగా క్రీడా ఉపాధ్యాయుడిని నియమించుకోవడం అభినందించదగిన విషయమన్నారు. అది పిల్లలలో క్రీడాసక్తిని పెంచుతుందని, తద్వారా విద్యార్థులు క్రీడలలో రాణించడానికి దోహదం చేస్తుందని, వారు ఉన్నతస్థాయి క్రీడలలో పాల్గొని పతకాలు సాధించే అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ గాలి సునీత మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉన్నతస్థాయి స్థానిక క్రీడాకారులను సన్మానించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో తమ పాఠశాల విద్యార్థులను నైపుణ్యం కలిగిన క్రీడాకారులుగా తయారు చేస్తామని, అందుకు సీనియర్ క్రీడాకారులు తమకు సహకరించాలనికోరారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నియమితులైన క్రీడా ఉపాధ్యాయుడు సుదేశ్ కుమార్ ను సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ.అరుణ, అకాడమిక్ హెడ్ ఫర్హాన, ఉపాధ్యాయులు దివ్యజ్యోతి, మౌనిక, స్రవంతి, క్షేమ, శర్మ, నిరీక్షణ న్యూస్ ప్రతినిధి శాంతి నిరీక్షణతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యువెలరీ షాప్ చోరీ ఘటనలో మరో నిందితుడు అరెస్ట్

**సూర్యాపేట,ప్రజాస్వరం**

జ్యువెలరీ షాప్ చోరీ ఘటనలో మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసారు. వెస్ట్ బెంగాల్ కు చెందిన ఏ5 నిందితుడు జషీముద్దీన్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. నిందితుడి నుంచి 25 తులాల బంగారం,రూ 4.80 లక్షల నగదు రికవరీ చేసారు. జూలై 21 వ తేదీన జిల్లా కేంద్రంలో సాయి సంతోషి జ్యువెలర్ షాప్ లో ఏడుగురు దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇప్పటివరకు నలుగురు అరెస్ట్ అయ్యారు. మరో ముగ్గురు దొంగలు ఇంకా పరారీలోనే వున్నారు.



## భక్తులకు, వాహన చోదకులకు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి

- **కమిషనర్ ఎన్.మౌర్య**

**తిరుపతి,**

అలిపిరి, రుయా పరిసర ప్రాంతాల్లో వాహన చోదకులకు, భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన పిర్యాదులు మేరకు శుక్రవారం రుయా హాస్పిటల్ నుండి అలిపిరి, జూ పార్కు మార్గంలో పుట్ పాత్, రోడ్ల పైన ఉన్న తోపుడు బండ్లు, పసుపు కుంకుమ వ్యాపారాలను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. అక్కడ వ్యాపారం చేస్తున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అలిపిరి వద్ద తోపుడు బండ్లు, టిఫిన్ షాపులు, పసుపు కుంకుమ అమ్మేవారు పుట్ పాత్ లు, రోడ్లు.పై వ్యాపారాలు చేయడం నడిచే వెళ్ళే వారు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారనే పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకుని వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించాలని అన్నారు. వ్యాపారస్థులకు ప్రత్యేకంగా వెండింగ్ జోన్ ఏర్పాటు చేసి అక్కడ వ్యాపారాలు చేసుకునేలా చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని అన్నారు. ఆదిశగా చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డి.ఈ. మధు, ఏసిపి మధు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.



## అందరూ విశాఖలోనే ఉన్నారు.. ఒక్కరైనా స్టీల్ ప్లాంట్ కి వెళ్ళండి

- **స్టీల్ ప్లాంట్ లో 44 ఈవోఐలకు టెండర్లు ఇవ్వడం అంటే ప్లాంట్ ను అమ్మేయడమే**
- **చంద్రబాబుకి తెలుగుజాతి కంటే..మోడీ ఖ్యాతి ముఖ్యం**
- **టీడీపీ తెలుగు వారి ఆత్మగౌరవ పార్టీ కాదు.. మోడీ ఆత్మగౌరవ పార్టీ**
- **వివేక హత్య విషయంలో సునీత ఆరోపణలో నిజం ఉంది**
- **ఎందుకు మళ్ళీ దర్యాప్తు చేయకూడదు ?**
- **సిబీఐ I గొంతు నొక్కి జగన్ ను,అవినాష్ రెడ్డిని మోడీ కాపాడుతున్నారు**
- **వైఎస్ షర్మిలా రెడ్డి**

**విజయవాడ**

ఇవ్వాళ విశాఖలోనే చంద్రబాబు, లోకేష్, పవన్ ఉన్నారు. విశాఖ స్టీల్ భవిష్యత్ మీద ఆందోళన జరుగుతుంది. స్టీల్ ప్లాంట్ పై మీ వైఖరి ఏంటో తేల్చాలి. స్టీల్ ప్లాంట్ లో ప్రైవేట్ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ 44 ఈవోఐలు ఇచ్చారు. కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేసే కుట్ర అని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. ఇప్పటికే కార్మికులను సగం తగ్గించారు. ఒకప్పుడు వైఎస్సార్ హయంలో 35 వేల మంది పని చేసే వాళ్ళు. ఇప్పుడు ఆ సంఖ్య ను 20 వేలకు కుదించారు. ప్రైవేట్ వ్యక్తులకు టెండర్లు అప్పగిస్తే కార్మికుల సంఖ్య తగ్గిపోతుంది. ఇది మోడీ చేస్తున్న దుర్మార్గపు చర్య. స్టీల్ ప్లాంట్ పై మోడీ ది సైలెంట్ కిల్లింగ్. కాంగ్రెస్ హయంలో స్టీల్ ప్లాంట్ కి పెద్దపీట వేశారు. ఒక ఏడాది నష్టం వస్తే 2 వేల కోట్లు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేశారు . ఇప్పుడు మోడీ హయంలో స్టీల్ ప్లాంట్ మొత్తం నిర్వీర్యం అవుతుంది. అందుకే ప్లాంట్ ను నష్టాల బాట పట్టించారని అన్నారు. అప్పులోకి నెట్టారు..రా మెటీరియల్ ఇవ్వలేదు. 10 లక్షల టన్నుల ఐరన్ ఓర్ కావాల్సి ఉంటే ఇప్పుడు 5 లక్షల టన్నులకు కుదించారు. ఇప్పుడు సొంత మైన్ ఇవ్వకుండా అప్పుల్లో నెట్టారు. కుక్కను చంపాలి అంటే పిచ్చిది అనాలి..ఇదే సిద్ధాంతం విశాఖ స్టీల్ మీద రుద్దు తున్నారు. విశాఖ స్టీల్ అప్పుల్లోకి నెట్టి అదానికి అప్పగించాలని చూస్తున్నారు. విశాఖ ఆస్తుల విలువ 4 లక్షల కోట్లు ఆ భూముల మీద మోడీ కన్నుపడింది. ఒక చేతితో 11 వేల కోట్లు ఇచ్చి మరో చేత్తో మొత్తం లాక్కోవాలని చూస్తున్నారు. విశాఖ స్టీల్ ఆంధ్రుల తలమానికం. ఆంధ్రుల ఆత్మగౌరవం. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు మోడీకి మద్దతు ఇస్తున్నాయి. ఎన్నెన్నో మాటలు చెప్పారు. అఖిల పక్షం వేయాలి అన్నారు ఎన్నికల్లో అన్ని మాటలు చెప్పి ఇప్పుడు మోడీకి మద్దతు ఇవ్వడం అన్యాయం. అందరు విశాఖలోనే ఉన్నారు.. కనీసం ఒక్కరైనా స్టీల్ ప్లాంట్ సందర్శించాలని అన్నారు. వివేక హత్య కేసులో అన్ని ఆధారాలు ఉన్నాయి. గూగుల్ మ్యాప్ లొకేషన్లు ఉన్నాయి. హత్య జరిగినప్పుడు అవినాష్ రెడ్డి సంఘటన స్థలంలో ఉన్నాడని సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఇన్ని ఆధారాలు పెట్టుకొని న్యాయం ఎక్కడ జరుగుతుంది ? సిబిఐ విచారణ సరిగా లేదు అనే సునీత ఆరోపణలో నిజం ఉందని అన్నారు.

# బ్యారేజీలతోనే పొలాలు మునుగుతున్నాయనటోళ్లు జవాబు చెప్పాలే

- **పార్వతీ గేట్లు దించకున్నా పోటుకమ్మిపొలాలు మునిగినయ్**
- **రైతులు ఎదుగబోతున్నారనే కుట్రతోనే ఎమ్మెల్యే కుట్రలు**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని**



బ్యారేజీలు వృదా అని, బ్యారేజీల నీళ్ల వల్లే పంట పొలాలు నీట మునిగిపోయి రైతులు నష్టపోతున్నారని మాట్లాడే వారు ఈనాడు బ్యారేజీ గేట్లు ఎత్తి ఉన్నా, ఒక్క చుక్క నీరు ఆపకుండా ఎలా మునిగిపోయాయో సమాధానం చెప్పాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మంథని గోదావరినది వరద ప్రవాహాన్ని, మునిగిన పంటలను పుట్ట మధు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిపురం గ్రామ సమీపంలోని పార్వతీ బ్యారేజీ దిగువ ఉన్న ప్రాంతాలను పరిశీలించామని, బ్యారేజీ గేట్లు మొత్తం ఎత్తి ఉన్నా గోదావరినది పోటు కమ్మి పొలాలు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల పొలాలే మునిగిపోయాయని అన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును నిర్వీర్యంచేసి ప్రజలకు అందుబాటులోకి రాకుండా చేశారని ఆయన మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ పారదర్శకంగా కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంటే మంథని ఎమ్మెల్యే కళ్లు మండిపోతున్నాయని దుయ్యబట్టారు. మంథని ఎమ్మెల్యే ఇక్కడ పుట్టలేదని,పెరుగలేదని, ఈ ప్రాంతంతో సంబంధం లేకపోవడం మూలంగానే ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఒకప్పుడు ఖానాపూర్ శివారులోని బండలమడుగుతో తనకు నాలుగు ఎకరాల భూమి ఉండేదని, గోదావరి పోటు కమ్మి అందుపెట్టితే ఆ అండుల్లో తన తండ్రి నువ్వులు పండించాడని, అందుభూమిలో పంటలు పండించిన చరిత్ర ఇక్కడి రైతులకు ఉందని చెప్పారు. ఆంధ్రా ప్రాంతంలో రైతులు మూడు పంటలు పండిస్తారంటే చూడలేదని, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో తరహాలో మూడు పంటలు పండించేలా ఎదుగుతున్నారనే మంథని ఎమ్మెల్యే కక్ష్యకట్టి ప్రాజెక్టును ఆపాలని చూస్తున్నాడని అన్నారు. ఆనాడు ఈ ప్రాంతా రైతాంగానికి ఏ కష్టం రాకుండా మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టు కట్టడంతో పాటు కరెంటు, నీళ్లు, ఎరువులు అందించి మూడు పంటలు పండించే దిశగా ప్రయాణించేలా చేశాడని గుర్తు చేశాడు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడుగులకు మడుగులు ఒత్తకుండా బరాజ్‌ల గేట్లు దించి రైతులకు సాగునీరు అందించేలా మంథని ఎమ్మెల్యే ఆలోచన చేయాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పేరు, కేసీఆర్ పేరు నియోజకవర్గంలో చిరకాలం ఉంటుందనే కక్ష్యతోనే మంథని ఎమ్మెల్యే కుట్రలు చేస్తున్నాడని ఆయన ఆరోపించారు. 40ఏండ్లు మీ కుటుంబానికి ఈ ప్రాంత ప్రజలు ఏకదాటిగా అవకాశం ఇస్తే ప్రాజెక్టులు వృదా, ఈ ప్రాజెక్టులతోనే పంటలు మునిగిపోతాయని మంథని ఎమ్మెల్యే అనడం ఆయన అవివేకానికి నిదర్శనమని, మంథని ఎమ్మెల్యే ఆలోచన చేయకపోయినా ఈప్రాంత కాంగ్రెస్ పార్టీ నాయకులైనా ఆలోచన చేయాలని ఆయన హితవు పలికారు. మంథని నియోజకవర్గంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఈ ప్రాంత ప్రజలు, రైతులు సంతోషంగా ఉంటారనేది నేటి పరిస్థితులే సాక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు యెగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, కాయితి సమ్మయ్య, పోలు కనకరాజు, కనవేన శ్రీనివాస్ యాదవ్, పుప్పాల తిరుపతి, గొబ్బూరి వంశీ, ఎస్ కే యాకూబ్, వేల్పుల గట్టయ్య, మంథని లక్ష్మణ్, బోనాల నరేందర్, జావేద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.





# శుక్రవారం సభలతో మహిళల్లో చైతన్యం

- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్**

ప్రతి పల్లెలో శుక్రవారం సభలు నిర్వహించి మహిళా సంక్షేమంపై అవగాహన కల్పించడం ద్వారా మహిళల్లో చైతన్యం నిండుతోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శంకరపట్నం మండలం వంకాయగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలలో చిన్న చిన్న వేదికలు ఏర్పాటు చేసి శుక్రవారం సభ ప్రారంభించామని తెలిపారు. ఈ సభల ద్వారా గ్రామ స్థాయిలో ప్రతి మహిళకు పోషణ, ఆరోగ్యం తదితర విషయాల పట్ల అవగాహన వస్తోందని అన్నారు. మహిళ తనతో పాటు తన పిల్లల పోషణ ఎలా ఉందో తెలుసుకోగలుగుతుందని వివరించారు. మహిళలకు చదువు కూడా ఎంతో అవసరమని, చదువు ఆపేసిన మహిళ 10వ తరగతి ఇంటర్ ఓపెన్ స్కూల్లో చేరాలని సూచించారు. తద్వారా తమ పిల్లల క్రమశిక్షణకు మార్గదర్శకం చేయవచ్చని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అక్కడ అన్ని వసతులు ఉంటాయని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బీపీ షుగర్ వంటి అన్ని వ్యాధులకు పరీక్షలతో పాటు గోలీలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. నెల నెల మందులు వాడేవారు ఆరోగ్య సిబ్బందికి తెలియజేస్తే ఇంటి వద్దకే మాత్రలు అందజేస్తారని అన్నారు. గ్రామంలోని ప్రతి మహిళ ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ అయిన మహిళకు చీర బహుకరించారు. ఈ సందర్భంగా కూరగాయలతో చేసిన పోషణ విఘ్నేషునికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్య అధికారి వెంకటరమణ, సిడిపిఓ శ్రీమతి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, మెడికల్ ఆఫీసర్ శ్రవణ్ పాల్గొన్నారు.

## గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించిన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

- **తెలుగు భాష ఔన్నత్యానికి గిడుగు వెంకట రామమూర్తి విశేష కృషి చేశారు :**
- **జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్**
- **పిల్లలు తెలుగు రాయడం, చదవడం, మాట్లాడడం పట్ల మక్కువ చూపాలి :**
- **డిఆర్ఓ నరసింహులు**

**తిరుపతి,**

తెలుగు భాష ఔన్నత్యానికి గిడుగు వెంకట రామమూర్తి విశేష కృషి చేశానని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోనే సమావేశ మందిరం నందు పర్యాటక శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి జయంతి పురస్కరించుకొని డిఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివ శంకర్ నాయక్, రోజ్ మాండ్ ల తో కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్... ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వాడుక భాషాయోధుడు, వ్యవహారిక భాషోద్యమానికిపితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. గ్రాంధిక భాష వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు రామమూర్తి నాంది పలికారన్నారు. వాడుకు భాషాయోధుడిగా, వ్యవహారిక భాషోద్యమ పితామహుడిగా గిడుగు వెంకట రామమూర్తి చేసిన విశేష కృషి కారణంగానే ఆయన పుట్టినరోజు తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పిల్లలందరూ తెలుగు భాష యొక్క ప్రాముఖ్యత తెలుసుకొని తెలుగు భాష పై మక్కువ చూపించాలని తెలిపారు. డిఆర్ఓ మాట్లాడుతూ.. గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా వారు తెలుగు భాషకు చేసిన సేవలకు గుర్తింపుగా ఈరోజు తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. పిల్లలందరూ తెలుగులో చదవడం, రాయడం మాట్లాడడం చాలా ముఖ్యమైన విషయాలని, ఇంగ్లీష్ మాధ్యమం రావడం వలన తెలుగులో మాట్లాడడం అనేది చాలా అరుదుగా కనిపిస్తుందని తెలిపారు. పిల్లలు ప్రతిరోజు తెలుగు పత్రికలను చదవాలని, వేమన రచించిన సుమతి శతకాలను అవగాహన చేసుకుని వాటిపట్ల మక్కువ చూపించాలని తెలిపారు. తెలుగు భాష దినోత్సవ సందర్భంగా తెలుగు పండితులందరిని ఈరోజు సన్మానించడం జరుగుతుందని తెలిపారు కార్యక్రమం అనంతరం జాయింట్ కలెక్టర్ తెలుగు భాషకు సేవ చేస్తున్న పండితులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## అంతులేని నష్టం

- **3వేల కోట్లుపైగా ఉంటుందని ప్రాథమిక అంచనా**

**హైదరాబాద్, ఆగస్టు 29**

తెలంగాణ వ్యాప్తంగా వరుణుడు ఉగ్రరూపం దాల్చడం, భారీ వర్షాలకు తోడు వాగులు ఉగ్ర రూపం దాల్చడంతో అనేక గ్రామాల్లో రహదారులపై ఊహించని విధ్వంసమే జరిగింది. వరదల తాకిడికి రహదారులు కొన్ని చోట్ల ఏకంగా కొట్టుకుపోయాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పంచాయితీ రాజ్ శాఖ పరిధిలో అనేక చోట్ల రహదారులు కుంగిపోవడం, భారీ గోతులు పడటం, పగిలిపోవడం జరిగింది.తాజాగా వరదలు, వర్షాల ప్రభావంతో పంచాయితీ రాజ్ శాఖ పరిధిలో రహదారులకు వాటిల్లిన నష్టం అక్షరాల 374 కోట్ల రూపాయలు. ఇదే విషయాన్ని తాజాగా ఆ శాఖ మంత్రి సీతక్కకు అధికారులు వివరించారు.ఈరోజు పంచాయితీరాజ్, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్షణ నిర్వహించిన మంత్రి సీతక్క రహదారుల నష్టంపై వివరాలు సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగాదెబ్బతిన్న రహదారుల పై ఆరా తీశారు. ముఖ్యంగా వరద తీవ్రత ఎక్కువగా ఉన్న కామారెడ్డి, మెదక్ ,సిద్దిపేట జిల్లాలలో రహదారులకు జరిగిన నష్టం, ప్రభావంతో అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 1291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు అధికారులు మంత్రికి నివేదించారు. వీటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.22.71 కోట్లు, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ. 352 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణ కోసం రూ.374.71 కోట్లు రూపాయలు అవసరమని తెలిపారు.